ప్రజాశక్తి
శనివారం 9 డిసెంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు



దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న చంద్రబాబు

రైతుల సమస్యలు పట్టించుకోని జగన్

మాజీ సిఎం, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

▲ 5లో



మరో గేటు కొట్టుకుపోయింది..

▲ 8లో

ఏ రైతన్నకూ..

అన్యాయం జరగనివ్వం..

- తుపాను బాధితులకు రేషన్, రూ.2,500 ఇస్తున్నాం..
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'పంట నష్టానికి సంబంధించి ప్రతి రైతన్నకూ ఒకటే చెప్పదల్చుకున్నా.. ఎవరైనా మీకు ఇన్‌పుట్ సబ్సిడీ రాదనో, ఇంకొకటి రాదనో చెబితే నమ్మవద్దు. మన ప్రభుత్వంలో ఎటువంటి పరిస్థితుల్లో మీకు అన్యాయం జరగదు.. అనేది గుర్తు పెట్టుకోవాలి' అని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. బాపట్ల జిల్లాలోని కర్లపాలెం మండలంలో దెబ్బ తిన్న పంటలను ముఖ్యమంత్రి శుక్రవారం పరిశీలించారు. పాతనందాయపాలెం, బుద్దాం గ్రామాల్లో వరి, మిరప,



మాట్లాడుతున్న సిఎం జగన్

వేరుశనగ పంటలను చూసిన ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుపాను వల్ల విపరీతమైన వర్షం నాలుగు రోజుల వ్యవధిలోనే పడిందని, దీని వల్ల పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారని చెప్పారు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా, నష్టం జరిగినా చేయి పట్టుకొని నడిపించి సహాయం చేయించే ఒక గొప్ప సచివాలయ వ్యవస్థ మన రాష్ట్రంలో ఉందన్నారు. వివక్షకు తావుండదని, నష్టం ఎవరికి జరిగినా, ▶ 2లో

ఏ రైతన్నకూ అన్యాయం జరగనివ్వం

(మొదటిపేజీ తరువాయి)

చివరికి మనకు ఓటు వేయని వారికి జరిగినా రాష్ట్ర ప్రభుత్వం అందరికీ తోడుగా ఉంటుందన్నారు. ఇంతకు ముందు కరువు, వరదలు వచ్చినా పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. గతంలో ఏరోజు ఇన్ పుట్ సబ్సిడీ వస్తుందో తెలియదని, ఎంత మందికి వస్తుందో తెలియదని, కానీ ఈ నాలుగున్నరేళ్ల తమ పాలనలో పూర్తిగా చరిత్ర మారిన పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. నీళ్లతో నిండిన గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ ఆదుకొనేందుకు, వాళ్లకు ఇవ్వాల్సిన రేషన్‌తో పాటు ప్రతి ఇంటికీ రూ 2,500 ఇచ్చిన చరిత్ర గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఇప్పటికే రేషన్, రూ.2,500 ఇచ్చే కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. నాలుగు రోజుల్లో ప్రతి ఇంటికీ పంపిణీ చేయడం పూర్తవుతుందన్నారు. ప్రతి ఇంటికీ వాలంటీర్ వచ్చి దగ్గరుండి ఇచ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు. మనం యుద్ధం చేస్తున్నది మారీచులతో ఒక్క చంద్రబాబుతో మాత్రమే కాదు, పనిగట్టుకొని అదేపనిగా అబద్ధాలనే నిజం చేయాలని, అబద్ధాలనే పనిగట్టుకొని చూపించేవాళ్లు, రాసేవాళ్లతో యుద్ధం చేస్తున్నామన్నారు.

ఇన్సూరెన్స్ గురించి సిగ్గుమాలిన, దిక్కు మాలిన రాతలు రాశారని, ఈ ఖరీఫ్ సీజన్‌లో నష్టం జరిగితే, మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చేలోపే ఇన్సూరెన్స్ ఇచ్చింది ఈ ప్రభుత్వంలోనే అన్నారు. ఇంతకు ముందు ఇన్సూరెన్స్ ఎప్పుడొస్తుందో, ఎంత మందికి వస్తుందో తెలియదన్నారు. అటువంటి పరిస్థితుల నుంచి ఇప్పుడు ప్రతి ఎకరానూ, ప్రతి సచివాలయం పరిధిలో ఈ క్రాప్‌లోకి నమోదు చేసి రైతు తరపున కట్టాల్సిన ప్రీమియం సొమ్ము కూడా ప్రభుత్వమే కడుతూ రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చిన చరిత్ర దేశంలో ఎక్కడైనా ఉందంటే అది మన రాష్ట్రంలోనే అన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో మీకు గుర్తుండే ఉంటుందని, ఐదేళ్లూ వరుసగా కరువు కాటకాలేనన్నారు. అయినా కూడా ఇన్సూరెన్స్ ఎంత అంటే, కేవలం 35 లక్షల మందికి కేవలం రూ.3,400 కోట్లు అని చెప్పారు. అదే ఈ ప్రభుత్వంలో ఈ నాలుగున్నర సంవత్సరాల్లో ఎక్కడా కరువు కాటకాలు ఏమీ లేకపోయినా రైతన్నలకు ఇన్సూరెన్స్ 55 లక్షల మందికి రూ.7,800 కోట్లు ఇచ్చామన్నారు.

ఏ సంవత్సరం అయినా ఈ ఖరీఫ్‌లో రైతన్న ఇబ్బంది పడితే, వచ్చే ఖరీఫ్ నాటికి ఇన్సూరెన్స్ కచ్చితంగా వస్తోందన్నారు. వచ్చే నెల సంక్రాంతి లోపు మీ అందరికీ ఇన్ పుట్ సబ్సిడీ వచ్చేస్తుందని చెప్పారు. విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు ఇచ్చి వారిని ఆదుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జరిగిన నష్టం అపారమైనదని, జరగాల్సిన, చేయాల్సిన సహాయం అంతా పారదర్శకంగా ప్రతి ఒక్కరికీ చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనలో మంత్రి మెరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకష్ణమూర్తి, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సంక్షేమ పాలన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమాన్ని వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పథకాలు ముందుకు సాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్తున్న రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు.

ఇప్పటి వరకు గ్రామానికి అందిన సంక్షేమ పథకాలను బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, నాయకులు జబివుల్లా, వెంకటేశ్వరరెడ్డి, గురిజేపల్లి వలి, రాంబాబు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులు ఈ పంట నమోదును సత్వరమే చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి పావని రైతులను కోరారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బోయళ్ల నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారి పి పావని మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ప్రభావంతో ప్రస్తుతం పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ పంట నమోదు సత్వరమే చేయించుకోవాలని కోరారు. అలాగే ఈ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి ఒక్క రైతు "ఈ పంట నమోదు" చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి మెంబర్లు శనగ పంటకు మద్దతు ధర పెంచాలని, అలాగే రైతులకు రాయితీపై వ్యక్తిగత పరికరాలు కూడా అందించాలని మండల వ్యవసాయ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి



మాట్లాడుతున్న ఎఒ పావని

మెంబర్లు, వ్యవసాయ విస్తరణ అధికారి కెవి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయం సంతనూతలపాడు యూనిట్ ఇన్‌ఛార్జి పి శేషమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మండల వ్యవసాయ అధికారి సంతనూతలపాడులోని చంద్ర ఫర్టిలైజర్స్ షాపుని సందర్శించి "బయోస్టిములెంట్స్"కు సంబంధించిన అనధికారిక నిల్వలు ఏమైనా ఉన్నాయా అని తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట నష్టపరిహారం అందజేస్తాం: ఎంపిపి

ప్రజాశక్తి-సిఎస్ పురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

మిచౌంగ్ తుపాను వల్ల మండలంలో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని మండల పరిషత్ అధ్యక్షులు మూడమంచు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షం వల్ల ఏయే పంటలు దెబ్బతిన్నాయో పరిశీలన చేసి నివేదిక తయారు చేయాలని సూచించారు. అలాగే రాబోయే రెండు రోజుల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని, రైతులకు పంటలను కాపాడుకునే విధంగా తగు సూచనలు ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఏయే పంటలు నష్టపోయారు? ఎన్ని ఎకరాల్లో పంట నష్టం జరిగిందో అంచనా వేసి నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాధ, ఉప్పలపాడు సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, రేగులచెలక ఎంపీటీసీ సభ్యులు జాజుల, బోయమడుగుల సర్పంచ్ బొట్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో తహశీల్దారు, ఎంఇఒ

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-దర్శి: తాళ్లూరు మండలం వెలుగువారిపాలెంలో ప్రాథమిక పాఠశాల(ఏపి) ఆవరణలో ఆక్రమణలు తొలగించాలని తాళ్లూరు తహశీల్దారు ప్రసాద్, ఎంఈఒ సుబ్బయ్య కోరారు. ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఆ గ్రామస్తులు స్పందనలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు, ఒంగోలులో డీఈఓకు అర్జీలు ఇచ్చారు. దరఖాస్తులు ఇచ్చి మూడు నెలలు అయినప్పటికీ ఆక్రమణలు తొలగించలేదని ఉన్నతాధికారులను మండల అధికారులు కోరారు. స్పందించిన తహశీల్దారు ప్రసాద్, ఎంఈఒ శుక్రవారం పాఠశా లకు వచ్చి గ్రామంలోని ఆక్రమణలు తొలగించాలని ఆక్రమించు కున్న వారిని కోరారు. స్పందించక పోతే చర్యలు తీసుకుంటామని అన్నారు. వారి వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

కోవిలంపాడులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని కోయిలపాడు గ్రామంలో టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జి షేక్ రజ్జాబ్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ రజ్జబ్ బాషా అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ మినీ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ రజ్జబ్ బాషా, టిడిపి కోయిలంపాడు పంచాయతీ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, షేక్ చిన్న ఖాజావలి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల కేంద్రమైన మద్దిపాడులో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏఓ సిహెచ్ వి సుబ్బారావు పలు సూచనలు చేశారు. పంచాయతీ సాధారణ పరిపాలనా విధానం, గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, ఆదాయ వనరులు ఏ విధంగా సమకూర్చుకోవాలి, ఎలా ఖర్చు చేయాలి, నిధుల ఖర్చుపై జవాబుదారీతనం, ఆడిట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

చెరువు నీటిని తాగేందుకే వినియోగించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని వల్లూరు చెరువు నీటిని వల్లూరు, సూరారెడ్డిపాలెం గ్రామ ప్రజల తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని ఇరు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావును కలిసి గ్రామస్తులు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వల్లూరు చెరువులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు వినియోగిస్తేనే రానున్న ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల వరకు మాత్రమే సరిపోతాయని చెప్పారు. కానీ దీనికి భిన్నంగా వల్లూరు గ్రామంలోని కొందరు భూస్వాములు చెరువు సమీపంలో మాగాణి సాగుకు సిద్ధమవుతున్నట్లు వారు పేర్కొన్నారు. చెరువు నీటిని వరి సాగుకు వినియోగిస్తే ఇప్పటి నుంచే ఇరు గ్రామాల ప్రజలు తాగునీటికి అల్లాడిపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వల్లూరు కింద వరి సాగు చేసినప్పటికీ నీటి విడుదలను నివారించాలని కోరారు. అదేవిధంగా చెరువు తూములకు సంబంధించిన లాకులను కూడా గ్రామ సర్పంచ్‌కు కూడా తెలియకుండా ఇతరుల వద్దే ఉంచుకున్నట్లు సమాచారం ఉందని, చెరువు భూముల లాకులను వెంటనే గ్రామ పంచాయతీకి స్వాధీనం చేయాలని వారు ఈ సందర్భంగా తహశీల్దారుకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బొజ్జా శ్రీనివాసులు, చిరుమామిళ్ల సుబ్బారావు, కొల్లూరి రాజారావు, చిరుమామిళ్ల గోపీకృష్ణ, పునుగోటి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-సిఎస్ పురం

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని ఎంపిపి మూడమంచు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్లను సచివాలయ సిబ్బందికి శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల మధ్య ఐక్యతా భావం పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉత్సాహవంతులైన వారిని గుర్తించి ఆటల్లో పాల్గొనే విధంగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి సుందరరామయ్య, బోయమడుగుల సర్పంచ్ బొట్ల చిరంజీవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టించుకొని.. డబ్బులివ్వకుండా..

మేదరమెట్లలో ఓ డాక్టర్ నిర్వాకం ● మనస్తాపంతో మేస్త్రీ కుమారుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మేదరమెట్ల

చేసిన కూలి డబ్బులు ఇవ్వలేదని మేస్త్రీ కుమారుడు ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన మేదరమెట్లలో శుక్రవారం జరిగింది. స్థానిక చరణ్ నర్సింగ్ హెూమ్ వైద్యులు ఎన్ వెంకటేశ్వరరావు 2017లో తమ్మవరం రోడ్డులో ఒక బిల్డింగును నిర్మించారు. తమ్మవరం గ్రామ వాస్తవ్యులు వల్లెపు సుబ్బారావు గుత్తాగా తీసుకొని కడుతున్నాడు. అతను చెప్పిన దాని ప్రకారం ఇదే క్రమంలో మాట్లాడుకున్నది ఒక రకమైనటువంటి పని, కానీ చేయిస్తున్నది కష్టమైన పని అని సుబ్బారావు డాక్టర్ వెంకటేశ్వరరావును అడుగగా ఎక్కువ డబ్బులు ఇస్తానులే అని పని చేయించుకున్నాడు. స్లాబు వరకు వచ్చేసరికి 100 యూనిట్లు సెంట్రింగ్ పెట్టించుకుని సుమారు 7 నెలల పాటు స్లాబు వేయలేదు. తర్వాత స్లాబ్ వేసిన అనంతరం సెంట్రింగ్ చెక్కను తీసుకువెళ్లనివ్వకుండా



ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని తీసుకెళ్తున్న పోలీసులు

నాలుగు నెలలు ఆపాడు. ఇదే క్రమంలో అప్పటికి పని విలువ రూ.85 లక్షలు అవ్వగా దఫాల వారీగా రూ.33 లక్షలు ఇచ్చినట్లు సుబ్బారావు తెలిపాడు. ఇంకా 52 లక్షలు ఇవ్వాల్సి ఉందన్నాడు. ఈ విషయమై జిల్లా ఎస్పీని కలువగా ఆయన సిఐకి ఫార్వర్డ్ చేశారన్నారు. ఈ విషయంలో కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ఫలితం లేదని, డబ్బులు అడిగితే వేరే విధంగా సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. చేసేదిలేక వారి నర్సింగ్ హెూమ్ ముందే సుబ్బారావు కుమారుడు వెంకటేశ్వరరావు కిరోసిన్ పోసుకుని అంటించుకుందామని చేసిన ప్రయత్నంలో చూసినవాళ్లు ఆపారని సుబ్బారావు తెలిపాడు. మాకు న్యాయం చేసేవరకు ఇక్కడి నుంచి కదలమని సుబ్బారావు, సుబ్బారావు కొడుకు, భార్య కుటుంబ సభ్యులు ధర్నాకు కూర్చున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం దాకా ధర్నాలోనే కూర్చొని ఉన్నారు. అయితే కిరోసిన్ పోసుకున్న సుబ్బారావు కొడుకు వెంకటేశ్వర్లును పోలీసు వారి సహాయ సహకారాలతో అద్దంకి ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. బాధిత కుటుంబం తమకు న్యాయం చేయాలని, దీక్షను కొనసాగిస్తున్నారు.

మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో వాటిపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పుల్లలచెరువు మండలంలోని కవలకుంట్ల గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామానికి చెందిన కొమ్ము జాన్ ప్రకాష్(27) అనే యువకుడు మోటారు సైకిల్‌పై యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామానికి వచ్చి చెరుకు మేస్త్రీ దగ్గర అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకొని పుల్లలచెరువు వెళ్లాడు. అక్కడ మొక్కజొన్న ఫ్యాక్టరీ దగ్గర పని చూసుకొని తిరిగి యర్రగొండపాలెం వచ్చేందుకు మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. కాగా యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి గ్రామానికి చెందిన పరిశపోగు వెంకట సహాయం, వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ఎనిబెర యోహాను, పుల్లలచెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన కేసినేని గురవయ్యలు ముగ్గురు కలిసి ఒకే మోటారు సైకిల్‌పై గంజివారిపల్లి నుంచి పుల్లలచెరువు మండలం నుంచి గంగవరం గ్రామంలో మర్లుపెళ్లికి



మృతి చెందిన జాన్ ప్రకాష్, గురవయ్య

వెళ్లేందుకు బయలుదేరారు. అయితే కొమ్ము జాన్ ప్రకాష్ మోటారు సైకిల్, వీరి మోటారు సైకిల్ కవలకుంట్ల గ్రామ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురెదురుగా వస్తూ రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో కొమ్ము జాన్ ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వారిని యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేర్పించి చికిత్సలు చేయిస్తుండగా కేసినేనిపల్లి గురవయ్య(29) మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇరువర్గాల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంతో మర్రివేములలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఉదయం 10 గంటలకు జరగవలసిన సమావేశం గంటన్నర ఆలస్యంగా అంటే సుమారు 12 గంటలకు ప్రారంభం కాగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమావేశం ప్రారంభమైన అరగంటలోనే ముగిసిపోయింది. 27 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించగా సమస్యలపై కౌన్సిల్ సభ్యులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రతి వార్డుకు రూ.5 లక్షల చొప్పున చెట్ల తొలగింపునకు కేటాయించామని గతంలో ప్రతిపాదనలు పెట్టారని, ఆ ప్రతిపాదనలకు తగ్గట్లు పనులు జరిగాయా లేదా తెలియజేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు కోరారు. వార్డులలో మంజూరైన పనులు పూర్తికాక పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. పారిశుధ్య కార్మికులు కూడా తమ మాట వినటం లేదని, అలాంటప్పుడు తమ పదవులకు విలువ ఏముంటుందని అసహనం వ్యక్తం చేశారు. వీధిలైట్లు, డ్రైన్లు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని మాచవరం కౌన్సిలర్ పి రాజశేఖర్‌రెడ్డి కోరారు.



మాట్లాడుతున్న మాచవరం కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి

12వ వార్డులో ఇంతవరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని అన్నారు. అభివృద్ధి చేయలేని చోట విజయం సాధించడం అంత తేలిక కాదని, అభివృద్ధిపై దృష్టి సారించాలని కౌన్సిలర్ శ్రీరాం సతీష్ కోరారు. తమ వార్డులో కుక్కల బెడద, శానిటేషన్ సమస్య, రోడ్ల సమస్య ఉందని, పరిష్కరించాలని కౌన్సిలర్ పి దీప కోరారు. వార్డులలో రోజురోజుకూ పారిశుధ్య సమస్య పెరిగిపోతోందని, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి కోరారు. అన్ని వార్డుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ డివిఎస్ నారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఏఈ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత రెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి వక్రబుద్ధి

- మాయమాటలు చెప్పి విద్యార్థినిని ఇంటికి పిలిపించుకున్న వైనం

- ప్రశ్నించిన సోదరుడిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న యువకుడు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రభుత్వ ఉపాధ్యాయుడి పాడుబుద్ధి ఇది. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఓ విద్యార్థినికి మాయమాటలు చెప్పి తన ఇంటికి పిలిపించుకున్నాడు. ప్రశ్నించిన ఆ బాలిక సోదరుడిని కత్తితో పొడిచి హత్యాయత్నం చేసి పారిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం పెద్దదోర్నాలలో జరిగింది. గిద్దలూరు ప్రాంతానికి చెందిన శ్రీనివాస ప్రసాద్ అనే ఉపాధ్యాయుడు పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థినితో ఆ ఉపాధ్యాయుడు గత కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్ పాఠశాలకు సెలవు పెట్టి కటకానివానిపల్లి వెళ్లే రహదారిలో తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉన్నాడు. కాగా ఆ విద్యార్థిని రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లింది. శ్రీనివాస ప్రసాద్ ఆ విద్యార్థిని తన ఇంటికి రమ్మని పిలిచాడు. దీంతో ఉదయం పాఠశాల ముగియగానే పుస్తకాలు పాఠశాలలోనే పెట్టి ఆ విద్యార్థిని శ్రీనివాస ప్రసాద్ ఇంటికి వెళ్లింది. అయితే పాఠశాలలో ఎవరైనా విద్యార్థులు పుస్తకాలు పెట్టి కనిపించకపోయినా, పాఠశాలకు రాకపోయినా సంబంధిత ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులపై ఆరా తీస్తారు. ఇదే క్రమంలో మధ్యాహ్నం నుంచి పాఠశాలకు రాని ఆ విద్యార్థిని ఇంటికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో ఆ విద్యార్థిని అన్నయ్య పాఠశాలకు వెళ్లి విషయం తెలుసుకున్నాడు. తన చెల్లెలు శ్రీనివాస ప్రసాద్ ఇంటికి వెళ్లిందని తెలియడంతో అక్కడికి వెళ్లి చాలాసేపు పిలిచాడు. అయినా తలుపు తెరవకపోవడంతో బలవంతంగా తలుపులు బాదాడు. తలుపు తీసిన ఉపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్ కత్తితో ఆ యువకుడి కడుపులో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రుడిని హుటాహుటిన పెద్దదోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు చేస్తున్నారు. ఉపాధ్యాయుడి ఇంట్లో మత్తులో పడి ఉన్న విద్యార్థినిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. ఎస్ఐ అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9లోపు కొత్త ఓట్లను నమోదు చేసుకోవచ్చు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఈ నెల 9వ తేదీలోపు కొత్తగా ఓట్లను నమోదు చేసుకోవచ్చని మండల తహశీల్దారు పి మధుసూదనరావు తెలిపారు. స్థానిక మండల తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీలోపు అర్హులైనవారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పుడు నమోదు చేసుకోని వారికి జనవరి 5వ తేదీన మరలా ఓటు నమోదుకు అవకాశం కల్పిస్తారని ఆయన తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించేలా బిఎల్‌ఓలు చూడాలని సూచించారు. ఓటరు జాబితాలలో మరణించిన వారి ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని బిఎల్‌ఓలకు సూచించారు. ఓటర్ల విచారణ పక్కాగా నిర్వహించాలని ఆయన కోరారు. ఓటుకు ఆధార్ నంబరును లింక్ చేయకపోతే ఓటును తొలగించరని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం హరిబాబు, సిపిఎం మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, నూకతోటి ఈశ్వరరావు, కత్తినేని శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు దుంపా యలమందరెడ్డి, బిజెపి నాయకుడు టి శ్రీనివాసరావు, డీటి శాంతికుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు మధుసూదనరావు

వాహనం ఢీకొని విద్యార్థికి గాయాలు

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-చీమకుర్తి



ప్రమాదానికి కారణమైన వాహనం

మండలంలోని పాటిమీదపాలెం అంబేద్కర్ నగర్ సెంటర్‌లో చీమకుర్తి-గంగవరం రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకిరువైపులా నివాసాలు, నిత్యం పిల్లలు,పెద్దలు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. వేగంగా పరుగెడుతున్న వాహనాలు ఎక్కడ గుద్దుతాయోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో చదువుతున్న క్రాంతికుమార్ అనే విద్యార్థి ఉదయం 7గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా పాల వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలులోని ప్రవేటు ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడు. గతంలో కూడా ఈ రోడ్డుపై పలు ప్రమాదాలు జరిగాయి. పాటిమీదపాలెంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ సెంటర్, బస్టాండ్ సెంటర్‌లలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ఎంపిటిసి కూడల అంజలీ మాలకొండయ్య, సర్పంచ్ బి కరుణ ప్రియ, విద్యా కమిటీ చైర్మన్ బిళ్లా శ్రీనివాసరావు, కాలనీవాసులు కోరుతున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ ఉగ్ర

నీరు లేదు.. నివాసం లేదు

శివనగర్ కాలనీవాసుల ఆవేదన

గెలిపించండి.. అభివృద్ధి చేస్తా: డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి: నీరు లేక, నివాసం లేక అల్లాడుతున్నామని, తమ సమస్యలు పట్టించుకునేవారే కరువయ్యారని శివనగర్ కాలనీ ప్రజలు టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి వద్ద ఆవేదన వెలిబుచ్చారు. కనిగిరి మున్సిపాలిటీ శివనగర్ కాలనీలో మన ఊరు -మన ఉగ్ర, బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత జలాలు అందిస్తానని, ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు పక్కా గృహాలను మంజూరు చేయిస్తానని డాక్టర్ ఉగ్ర తెలిపారు. వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వివిఆర్ మనోహర్రావు, చింతలపూడి తిరుపాలు, పచ్చవ చంద్రశేఖర్, పాలూరి సత్యం, ఈదర రవికుమార్, కనిగిరి మనోహర్రావు, ఉదయగిరి బాలచెన్నయ్య, చిలకపాటి లక్ష్మయ్య, నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-కనిగిరి: తుపాను కారణంగా కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దెబ్బతిన్న మిర్చి, మినుము పంటలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేసి పంట నష్టపరిహారం అందేలా వ్యవసాయ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని డిమాండ్ చేశారు. కరువు కాలంలో చేసిన పరిశీలన ప్రకారం రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు, నాయకులు ఏడుకొండలు, ఎస్కే బషీరా, శాంతకుమారి పాల్గొన్నారు.



తహాశీల్దారును చుట్టుముట్టిన వాడరేవు మత్స్యకారులు

మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - చీరాల

తుఫాన్ భాధిత మత్స్యకార కుటుంబాలను అదుకోవడంలో జగన్ ప్రభుత్వం వివక్ష చూపుతుందని మత్స్యకారులు రోడ్డుపై బైఠాయించారు. మండలంలోని వాడరేవులో మత్యకారులు శుక్రవారం అందోళన చేశారు. మత్స్యకారులను ప్రభుత్వం అదుకోవాలంటూ నినాదాలు చేశారు. గ్రామంలో 500కుటుంబాలు ఉంటే అధికారులు తుఫాన్ షెల్టర్‌లో ఉన్న 40కుటుంబాలకు మాత్రమే రు.2500 చొప్పున అర్ధిక సహాయాన్ని అందించి చేతులు దులుపుకున్నారని అన్నారు. గత పదిరోజులుగా తుఫాన్ ప్రబావంతో వేటనిలిచిపోయి, ఇళ్ళలోకి నీరు చేరి, పూటగడవక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలను అదుకోవాలంటూ డిమాండ్ చేశారు. అందోళనకారులను సర్ది చెప్పేందుకు వచ్చిన అధికారులపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువేళ్ళి సమస్యను పరిష్కారిస్తామని తహసీల్దార్ జె ప్రభాకరరావు మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. మత్స్యకారుల ఆందోళనకు టిడిపి, జనసేన ఇంచార్జిలు ఎంఎం కొండయ్య, అమంచి స్వాములు మద్దతు ప్రకటించారు.



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతునేత హనుమంతరావు

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

చేతికందే దశలో ఉన్న పంటలు తుఫాను వర్షాలు, పెనుగాలి చుట్టేయడంతో చేనులోనే గుండె ఆగి మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు బత్తుల హనుమంతరావు డిమాండ్ చేశారు. మండలంలోని తాటివారిపాలెంలో 12ఎకరాల శెనగ పంట నీటితో చెరువుగా మారడంతో గుండె ఆగి మృతి చెందిన రైతు గన్నవరపు మస్తానరావు కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఎకరా రూ.25వేల చొప్పున 11ఎకరాలు కౌలుకు తీసుకొని తనకున్న సొంత పొలం ఎకరంతో కలిపి 12ఎకరాలు శెనగ పంట సాగు చేశాడని తెలిపారు. రైతు మస్తానరావు గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తహాశీల్దారు సుజాతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్సులు పాలేపు సాంబయ్య, వీరవల్లి కృష్ణమూర్తి, పేర్ని నాగేశ్వరరావు, శేషాద్రి, వీరయ్య, బొడెంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని 27వ వార్డులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బషీరున్నిసా కుటుంబానికి జమియా మసీదు పెద్దలు వంట సామాగ్రి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా జనాబ్ అన్వర్ బేగ్ సాబ్ మాట్లాడుతూ నిరాశ్రయులు అవడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం సహాయం అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకుని ఆదుకోవాలనే ఉద్దేశంతో జమియా మసీద్ పెద్దల దృష్టికి తీసుకువెళ్లగా మత పెద్దల సహకారంతో సహాయం చేశామని అన్నారు. కార్యక్రమంలో అరవపల్లి సర్పంచ్ లోయ బాబు,



అగ్ని ప్రమాద బాధితునికి సరుకులు ఇస్తున్న ప్రతినిధులు

కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



దెబ్బతిన్న పొగతోటను పరిశీలిస్తున్న సిపిఎం నేత వినోద్



బైట్‌బర్లీ పరిశీలిస్తున్న సిపిఎం నేత తంగిరాల వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పంగులూరు

తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట నష్టపరిహారం కౌలు రైతులకూ ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా మండలంలోని తూర్పు కొప్పెరపాడులో దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తుఫాను కారణంగా మిర్చి, పొగాకు, మినుము, శనగ, వరి మొదలైన పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. దీనివలన కౌలు రైతులు రూ.లక్షలు నష్టపోయారని అన్నారు. జిల్లాలో 60శాతం మంది కౌలు వ్యవసా యం చేస్తున్నారని పేర్కొన్నారు. వీరంతా పేదలేనని అన్నారు. 80శాతం భూమి కౌలు రైతుల కష్టంతోటే సాగవు తుందని అన్నారు. అందువలన నష్ట పరిహారాన్ని కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. తమ భూములను కౌలుకి ఇచ్చినా, వాళ్ల కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇప్పించేందుకు సహకరించటం లేదని తెలిపారు. దీనిని సాకుగా తీసుకొని అధికారులు కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వకపోగా ఈ క్రాప్ కూడా భూ యజమానుల పేరు మీదే చేస్తున్నారని తెలిపారు. కష్టపడి, పెట్టుబడి పెట్టి సాగు చేసిన కౌలు రైతుకు నష్టపరిహారం అందే పరిస్థితి కానరావడం లేదని తెలిపారు. సాగు చేయకుండా భూ యజమానులు పంట నష్ట పరిహారం కూడా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నిజమైన కౌలు రైతుల పేరుతో ఈక్రాప్ చేయాలని అన్నారు. కొప్పెరపాడు గ్రామంలో 200ఎకరాల్లో పొగాకు, 100ఎకరాల్లో మిర్చి, 300ఎకరాల్లో శనగ పంటను కౌలు రైతులు సాగు చేశారని చెప్పారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతులు పాలపర్తి అబ్రహం, కుంట ఆదామ్, పాలపర్తి బాబు, ఎడ్లూరి శేషయ్య, పాలపర్తి శేషగిరి, పాలపర్తి రాంబాబు పాల్గొన్నారు.

అద్దంకి : తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని చెల్లించి రైతులను ఆదుకోవాలని సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో పొగాకు, మిర్చి పంటలను సిపిఎం నాయకులు పొనకా రామాంజనేయులుతో కలిసి పరిశీలించారు. మండలంలో అనేక గ్రామాలలో రైతులు వేసిన పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ఎకరాకి రూ.50వేలు నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న, వరి, ఇతర మెట్ట పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. కౌవులు రైతులు అధికంగా ఉన్నారని చెప్పారు. కౌలు రైతులను గుర్తించి నష్టపరిహారం అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పర్సంటేజీ ఆధారంగా నష్టం పరిహారం అంచనా వేసే విధానాన్ని మార్చుకోవాలని కోరారు. 30 శాతంపైగా నష్టం జరిగితేనే పరిహారం ఇస్తామని చెప్పడం బాధాకరమని అన్నారు. ఎంత నష్టం జరిగితే అంత నష్టాన్ని ఇవ్వాలని కోరారు. తప్పించుకునేందుకే ప్రభుత్వం పర్సంటేజీ విధానం ముందుకు తెచ్చిందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. తమ పర్యటనల్లో గుర్తించిన నష్టాన్ని అంచనా వేసి అధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. గ్రామాల్లో రైతులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుంటున్నట్లు తెలిపారు. వెంటనే గ్రామాలకు అధికారులు వచ్చి దెబ్బతిన్న పంటలను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలా కానీ పక్షంలో ఆందోళన పోరాటాలకి సిద్ధం కావాలని రైతులను కోరారు.

రేపల్లె : తూఫాన్ వల్ల పంట నష్టం పరిశీలనకు వచ్చిన సిఎం వైఎస్ జగన్ కౌలుకార్డు లేని కౌలు రైతులు, పోరంబోకు భూములు, దేవాలయ భూముల్లో సాగు చేస్తున్న వారికి కూడా నష్టపరిహారం ఇచ్చే అంశం ప్రస్తావించకపోవడం బాధాకరమని సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణి లాల్ పేర్కొన్నారు. నష్ట పరిహారం నష్టపోయిన ప్రతి ఎకరాకు చెల్లిస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని కోరారు. నల్లురిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులు, సన్నకారు రైతులు పెట్టుబడి పెట్టి, వ్యవసాయం చేస్తూ తుఫాన్ ప్రభావం వల్ల సర్వం కొల్పయారని చెప్పారు. కానీ వీరికి నష్ట పరిహారం ఇవ్వకుండా అనర్హులను చేస్తున్నారని అన్నారు. పరిశీలకు వచ్చే రెవెన్యూ సిబ్బంది వీళ్ల పేర్లు నమోదు చేయడం లేదని చెప్పడంతో ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. మండలంలోని నల్లూరిపాలెం, సింగుపాలెం బాడే, జన్నే కాలువ పరిధిలో దాదాపు 100ఏళ్ల నుంచి పోరంబోకు భూములుసాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తూ వచ్చిందని తెలిపారు. గత నాలుగేళ్లుగా పన్ను కూడా కట్టించుకోవటం లేదని తెలిపారు. దీంతో ప్రభుత్వ నుండి వ్యవసాయంకు అందే రాయితీలు అందటం లేదని తెలిపారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికీ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల కార్డులు లేకపోవటంతో నష్టపరిహారం పొందటానికి అనర్హులు అవుతున్నారని తెలిపారు. కౌలు రైతు కార్డుతో సంబంధం లేకుండా కౌలు రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా విఆర్‌ఓతో పరిశీలన చేయించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం అందకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నల్లూరిపాలెం కౌలు రైతులు డి బాబురావు, కె మరిదాసు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి మణిలాల్

రైతులకు కోలుకోలేని దెబ్బ

◆ వడలిపోతున్న పైర్లు ◆ అగమ్య గోచరంగా రైతన్న పరిస్థితి



నీళ్లు తీసి ఎండ తగిలాక ఎండుతున్న మిర్చి పంట

ప్రజాశక్తి - ఇంకొల్లు

పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యం గోచరంగా ఉంది. కొమ్మమూరు కాల్వకు గండ్లుపడి ఆలేరు, నక్కవాగులతోపాటు వివిధ గ్రామాలలో వాగులు పొంగాయి. పొలాలు నీట మునిగి, పూర్తిగా దెబ్బతింటే, వాగు పోటులు లేని వివిధ మేరక పొలాలలో సాగుచేసిన వాణిజ్య పంటలైన పొగాకు, మిరప, శెనగ, పత్తి పంటల రైతుల పరిస్థితి ఆవేదనగా ఉంది. రెండు రోజులగా వర్షాలు తగ్గి ఎండలు కాస్తున తరుణంలో మొక్కలకు సూర్య రశ్మి తగలటంతో రోజు రోజుకు వురకెత్తిన మిరప, పొగాకు వడలిపోయి ఎండు ముఖం పడుతున్నాయి. శనగ, మినుము పైర్లు కూడా రంగు మారుతున్నాయి. ఆశ చావని రైతులు ఈపాటికి పడిపోయిన మిరప మొక్కలను నిలదొక్కటం, ఉరక తిప్పుకుంటాయన్న ఆశతో యూరియా, సూపర్ చల్లటం ప్రారంభించారు. అక్కడక్కడ మరీ మెరక ప్రాంతం తప్ప మిరప ఉరకతిప్పుకునే పరిస్థితి లేదు. బర్లీ పొగాకు సాగైన విస్తీర్ణంలో మూడు వంతులుపైన ఆశ వదులుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, కారంచెడు, ఇంకొల్లు మండలాల్లో పదివేల హెక్టార్ల పైనే ముదురు పొగాకు సాగు చేసిన అంచనా. మొదట్లో వర్షాబావ పరస్థితులు కొనసాగినప్పటికీ అనూహ్యంగా మిరప సాగు కూడా ఎక్కువగానే చేపట్టారు. దాదాపు 5వేల హెక్టార్లపైనే మిరప సాగైనట్లు అంచనా. శనగ సాగు కొందరి రైతులు విత్తనాలు ఎదపెట్టగా కొందరు రైతులు వర్షం హెచ్చరికతో ఎదబెట్టలేదు.

కౌలు రైతులకు కోలుకోలేని దెబ్బ

వాణిజ్య పంటలైన పొగాకు, మిరప సాగు చేసిన రైతులను, కౌలు రైతులు, సన్న, చిన్నాకరు రైతులను తుఫాను కోల్కోలేని దెబ్బ కొట్టింది. పొలానికి ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు, వ్యవసాయానికి రూ.10వేలు, పొగనారుకు రూ.10వేలు, నాటుకు ఎకరాకు రూ.4వేలు, ఎరువులు, కలుపు సస్యరక్షణకు మరో రూ.6వేల నుండి రూ.8వేలు ఖర్చు పెట్టారు. ఈ లెక్కన కౌలు రైతుకు దాదాపు ఎకరానికి రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చు అయ్యింది. వర్షం పడకుంటే దాదాపు మరో పది రోజుల్లో అడుగు ఆకు కొట్టుడుకు వచ్చేవి. వర్షం ఆగిన తరువాత ఎండపడటంతో పొగమొక్కలు కుషించిపోతున్నాయి.

మిరప రైతు పరిస్థితి అంతే

మిరప సాగు చేపట్టిన రైతుల పరిస్థితులు కూడా ఆందోళనగా ఉన్నాయి. ముదురు తోటలకు అడుగు కాపు కాచాయి. లేత తోటలు కొన్ని కాపుదశకు వచ్చాయి. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్ష30వేల వరకు ఖర్చు చేశారు. లేత తోటల సొంత భూమి ఉన్న రైతులకు ఎకరాకు ఇప్పటికీ రూ.లక్ష వరకు ఖర్చు అయింది. హైబ్రిడ్ సాగు మిరప ఎక్కువగా దెబ్బ తగిలింది. దెబ్బతిన్న పొలాలను ప్రభుత్వం సిబ్బంది ద్వారా త్వరగా నమోదు చేయించి ఈ క్రాప్ ఇన్సూరెన్స్ ఇన్పుట్ సబ్సిడీతో పాటు కౌలు రైతులను గుర్తించి సాయం చేయాలని రైతులు కోరుతున్నారు. షరతులు లేకుండా నష్టపోయిన రైతులు అందరికీ పరిహారం చెల్లించి ఆదుకుంటేనే రైతుల్లో మనోధైర్యం కలుగుతుంది.

జాతీయ శిక్షణకు విద్యార్థినులు

ప్రజాశక్తి - బాపట్ల

వ్యవస్థాపక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా జాతీయ ఉన్నత విద్య పథకం ద్వారా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. హైదరాబాదులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్సటెన్షన్ మేనేజ్ మెంట్ సంస్థ వీరికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థ ద్వారా కొత్త తరానికి వ్యవసాయ రంగంలో మరింత శిక్షణ అందించేందుకు నలుగురు విద్యార్థినులను మెరిట్ ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 9నుండి 29వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐడిపి అసిస్టెంట్ కోఆర్డినేటర్లు కె చంద్రశేఖర్, బి రత్నకుమారి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : పాలేటి

ప్రజాశక్తి - చీరాల

తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు కోరారు. మండలంలోని బోయినవారి పాలెం పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రొంపేరు కాలువను, సాకి డ్రైను, స్టువర్టుపురం ఛానల్, వేటపాలెం మండలం నాయినపల్లి ఎత్తిపోతల పథకం పరిశీలించారు. కాలువలో గుర్రపు డెక్క, తూటి కాడ, బూరగాకు తొలగించి నీటిపారుదల మార్గం చూపాలని సూచించారు. ఆయన వెంట ఎర్రకుల శ్రీనివాసరావు, బోయిన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బోయిన కేశవులు, చప్పిడి వెంకటేశ్వర్లు, గవిని శీను, గవిని పకీరయ్య, తలారి శీను, తలారి రాజు ఉన్నారు.



రొంపేరు పరిశీలిస్తున్న పాలేటి

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వినోద్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్ననాయకులు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా 45వ మహాసభలు ఈనెల 12,13 తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్. వినోద్ కోరారు. మహాసభల్లో విద్యార్థులు, మేధావులు, ప్రజలు, ఎస్ఎఫ్ఐ నాయకులు కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మార్కాపురం డివిజన్ పరిధిలోని ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం అనే నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ జిల్లా 45వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో గత కార్యక్రమాలపై సమీక్షించి, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో విద్యారంగ అభివద్ధికి అవసరమైన తీర్మానాలు చేసేందుకు మహాసభలు వేదిక కానున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, హరీష్, షేక్ జబ్బర్ తదితరులు పాల్గొన్నారు

టిడిపితోనే మహిళలకు అండ : స్వామి


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

టిడిపి మహిళలకు అండగా ఉంటుందని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శింగరాయకొండ మండలం మూలగుంట పాడు పంచాయతీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు కరెంటు స్తంభాలు, తాగునీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, వేల్పుల సింగయ్య , చీమకుర్తి కృష్ణ, మందలపు గాంధీ చౌదరి , దక్షిణం శ్రీను, సన్నెబోయిన మల్లికార్జున, అంబటి శ్రీను, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనావుల్లా, షేక్ సంధాని బాషా, షేక్ యస్థాని, కనిగిరి వెంకటేశ్వర్లు, సుదర్శి ప్రసాదరావు, శీలం చంటి, పసుపులేటి వెంకట శేషు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం

విధుల్లో చేరకుండానే వెనుదిరిగిన కార్యదర్శి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో పంచాయతీ కార్యదర్శి నియామకం గందరగోళంగా ఉంటుంది. ఇటీవల 10మంది కార్యదర్శులు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. కొందరు సస్పెండ్ అయ్యారు. తాజాగా రెండు రోజుల క్రితం శింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గుంటూరు జిల్లాకు చెందిన వెంకటప్పయ్యను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, డిపిఒ నారాయణరెడ్డి నియమించారు. వెంకటప్పయ్య డిపిఒ కార్యాలయంలో ఆర్డర్ తీసుకొని వచ్చి తాను సెలవుపై కాశీకి వెళ్తానని ఎంపిడిఒ జమీఉల్లాకు తెలిపాడు. అలాగైతే జాయిన్ చేసుకోవడానికి కుదరదని ఎంపిడిఒ తెలిపాడు. దీంతో వెంకటప్పయ్య తన ఆర్డర్ కాపీని తీసుకొని వెళ్లిపోయాడు. శింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి నియామకం జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారులకు కత్తి మీద సాము లాగా ఉంది.

కార్తీక వన భోజనాలు

ప్రజాశక్తి- కొత్తపట్నం

కార్తీక మాసం సందర్భంగా కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్ ఒంగోలు నియోజకవర్గ స్థాయిలో మహిళలకు కార్తీక వనభోజనాలు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సతీమణి నాగసత్యలత ఆధ్వర్యంలో వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామచర్ల జనార్ధన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాళం నరసమ్మ, ఒంగోలు మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-టంగుటూరు

బాపట్లలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. టంగుటూరులోని బస్ స్టాప్ సెంటర్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచ దేశాలలో చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి తారక రామారావు అని కొనియాడారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు కామని నాగ శ్రీను, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు ధర్నాసి బ్రహ్మానందం, రమేష్ బాబు, మద్దిరాల వెంకట్రావు పాల్గొన్నారు.

పశుఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేత


పశుఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేస్తునన బేబిరాణి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పాడి రైతుఉల పశుఆరోగ్య సంరక్షణ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జెడిఎ బేబిరాణి తెలిపారు. మండల పరిధిలోని ఒమ్మెవరం గ్రామంలో తుపాన్ సహాయక చర్యల్లో భాగంగాఉచిత పశు వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా జెడిఎ మాట్లాడుతూ పశవుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా గొంతువాపు రాకుండా 110 దూడలు, గేదెలకు టీకాలు వేశారు.అనంతరం పాడిరైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాల ఒంగోలు ఉపసంచాలకులు డాక్టర్ రమేష్ బాబు, నాగులుప్పలపాడు పశు వైద్యశాల సహాయక సంచాలకులు ఎస్. నాగభూషణం, ఉప్పుగుండూరు పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ జాస్మిన్ ,జూనియర్ వెటర్నరీ అధికారి బి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకోని జగన్

- ఉల్లిగడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని వ్యక్తి సిఎంగా ఉండటం ప్రజల దౌర్భాగ్యం
- నష్ట పరిహారం తగ్గించటం శోచనీయం
- మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

తుపాను వస్తుందని ముందుగా తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు. ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు గోనె సంచులు కూడా ఇవ్వలేదు. నేనొస్తున్నానని తెలిసి చిరిగిపోయిన సంచులు ఇచ్చారు. తన పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇవాళ బయటకొచ్చారని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి జగన్ తీరును తప్పుబట్టారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ పరిధిలోని అమతలూరులో మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన పంట పొలాలను చంద్రబాబు నాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తుపానుతో పంట నష్టపోయి రైతులు కన్నీరు పెడుతుంటే ముఖ్యమంత్రి బాధ్యత రాహిత్యంగా వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. వేమూరు నియోజక వర్గంలో 90 వేల ఎకరాల్లో పంట సాగుచేస్తే 90 శాతం పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. ఎకరాకు రూ.50 వేల వంతున రైతులు ఖర్చు చేశారని తెలిపారు. రేపల్లెలో లక్ష ఎకరాల్లో పంట సాగు చేస్తే 60 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు తెలిపారు. బాపట్లలో 45 వేల ఎకరాలు సాగు చేస్తే 45 వేల ఎకరాల్లో పంట దెబ్బతిందన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని చంద్రబాబు కోరారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతున్నారు. పంటలు దెబ్బతిని రైతులు కోలుకునే పరిస్థితి లేదన్నారు. టిడిపి హయాంలో ఎప్పటికప్పుడు పంట కాలువల్లో పూడికలు తీసినట్లు తెలిపారు. నేడు ఎక్కడైనా పంట కాలువల్లో పూడిక తీశారా? డ్రెయిన్స్ శుభ్రం చేశారా అని ఆయన ప్రశ్నించారు.

జగన్ రెడ్డికి బంగాళ దుంపలకు, ఉల్లిగడ్డలకు తేడా తెలియదని విమర్శించారు. పొటాటో అంటే ఏమిటని రైతులను అడుగుతున్నారన్నాని, ఇంతకంటే దారుణం ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. వైసిపి మంత్రులు సాధికార యాత్ర పేరిట తిరుగుతున్నారన్నారు. వారి మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతలు గడప కూడా దాటం లేదన్నారు. టిడిపి హయాంలో వరికి నష్టపరిహారంగా రెండురన్న ఎకరాలకు రూ.20 వేలిస్తే నేడు రూ.15 వేలకు తగ్గించినట్లు తెలిపారు. జగన్ రెడ్డి బాధితులకు 25 కేజీల బియ్యం ఇచ్చామంటున్నారని తెలిపారు. 25 కేజీల బియ్యంతో రైతుల జీవితాలు బాగుపడతాయా అని ప్రశ్నించారు.

టిడిపి హయాంలో నేత కార్మికులు, మత్స్య కార్మికులకు 50 కేజీల బియ్యం, ఖర్చులకు రూ. 5 వేలు ఇచ్చినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రస్తుతం రూ 2,500 ఇస్తారంటా అని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పేదలను అన్ని విధాల ఇబ్బందులకు గురి చేస్తోంది. రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మరో 3 నెలల్లో టిడిపి ప్రభుత్వం వస్తుందని, నష్టపోయిన రైతులందరినీ ఆదు కుంటామని తెలిపారు. ప్రజల్లో చైతన్యం రావాలి, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు.

ఆలస్యంగా చంద్రబాబు పర్యటన

తుపాను కారణంగా పంటనష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన చంద్రబాబును చూసేందుకు ప్రజలు అత్యధిక సంఖ్యలో రావడంతో పర్యటన ఆలస్యంగా సాగింది. వేమూరు నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు టిడిపి నేత నక్కా ఆనంద్‌బాబు, జనసేన నాయకులు స్వాగతం పలికారు.

- కూచిపూడిలో పంటలు పరిశీలించి రైతులతో చంద్రబాబు మాట్లాడారు.
- అమర్తలూరు మండలం కూచిపూడి, పెదపూడి, అమర్తలూరు, గోవాడ గ్రామాలలోని పంట పొలాలును పరిశీలించారు.
- చెరుకుపల్లి, నగరం మండలాల్లో పర్యటన పూర్తి చేసుకుని బాపట్ల నియోజకవర్గంలో పంటపొలాల సందర్శనకు సాయంత్రం 4.30 గంటలకు రావలసిన చంద్రబాబు రాత్రి 10 గంటలకు కూడా రాలేకపోయారు.
- రాత్రికి బాపట్లలో బస చేసి శనివారం ఉదయం పర్చూరు నియోజకవర్గంలో పర్యటిస్తారు.

కార్యకర్తలకు చంద్రబాబు అభివాదం

చెరుకుపల్లి : తుపాను బాధితులను పరామర్శించేందుకు బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్‌లో ఆగి కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం తూర్పుపాలెం, పుడివాడ అడ్డరోడ్డు వద్ద వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి, రైతులను అడిగి నష్టం వివరాలు తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేలా రైతుల తరఫున పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఎమ్మెల్యే అనగానీ సత్యప్రసాద్, టిడిపి నాయకులు మల్లాది రామకష్ణ, డివి.రాంబాబు, పి. కుమారస్వామి ,సనకా శ్రీనివాసరావు, ఎంఆర్‌కె. మూర్తి, వుపాల సాంబశివరావు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు సంబంధించిన క్రీడా సామగ్రిని యర్రగొండపాలెం-1 సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పురుషులు, మహిళలకు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మూర్తిరెడ్డి, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జడ్‌పి కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, ఇఒఆర్‌డి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎఎంసి వైస్ చైర్మన్ కొర్రపోలు జయరావు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గురిజేపల్లి వలి, జబివుల్లా, నర్రెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శులురామారావు నాయక్, రామ సుబ్బయ్య, శివలింగమ్మ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

రూ.5వేల విరాళం అందజేత

కొమరోలు : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రహరీ నిర్మాణానికి దివ్య హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.5 వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. చర్చి అధ్యక్షుడు సుబ్బయ్య, ఆనందరావుకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో దివ్య హెల్పింగ్ హ్యాండ్స్,అధ్యక్షుడు లొక్కు శరత్ బాబు, ఉపాధ్యక్షుడు సిహెచ్.సునీల్ కుమార్ నాయుడు. సెక్రెటరీ చిన్న పీరయ్య,ట్రెజరర్ కలగొట్ల చిన్న సిద్ధయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

పెద్దారవీడు : ఎరువుల దుకాణంలో మార్కాపురం వ్యవసాయ సంచాలకులు రమాదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని రిజిస్ట్రర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న బయో ఫెర్టిలైజర్స్ మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ కె.బుజ్జిబాయి పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

యర్రగొండపాలెం : బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ వైవి..నాగేశ్వర ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ, వైఎస్ఆర్ క్రాంతి పథం, వైద్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందన్నారు. అవగాహన లేక బాల్య వివాహాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ నాయబ్ రసూల్, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఎడ్వర్డ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వైపాలెం వైసిపి టిక్కెట్

సురేష్ కుమార్‌కేనా..?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ కె.సురేష్ కుమార్ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. సురేష్ కుమార్ ప్రస్తుతం తాడికొండ వైసిపి సమన్వయకర్తగా పని చేస్తున్నారు. ఆయన భార్య హెనీ క్రిస్టినా గుంటూరు జడ్‌పి చైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కొనసాగుతున్న ఆదిమూలపు సురేష్‌ను కొండపి నియోజకవర్గంలో పోటీ చేయాలని అధిష్టానం ఆదేశించింది. దీంతో డాక్టర్ సురేష్ కుమార్‌ను యర్రగొండపాలెం పోటీ చేయించేందుకు అధిష్టానం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. యర్రగొండ పాలెం నియోజకవర్గం 2009లో ఏర్పడింది. అప్పటి నుంచి మూడు పర్యాయములు ఎన్నికలు జరిగాయి.ఒకసారి కాంగ్రెస్, రెండుసార్లు వైసిపి అభ్యర్థులే విజయం సాధించారు. ఈ నియోజకవర్గం వైసిపికి కంచుకోటగా ఉంది. కొండపిలో వైసిపి జెండా ఎగురవేసేందుకు మంత్రి సురేష్ సమర్థుడని భావించి ఆయన్ని కొండపికి వెళ్లాల్సిందిగా అధిష్టానం ఆదేశించినట్లు తెలుస్తోంది. డాక్టర్ కె.సురేష్ కుమార్ కూడా యర్రగొండ పాలెంలో పోటీ చేసేందుకు కూడా సముఖత తెలిపినట్లు తెలిసింది. కాగా మంత్రి సురేష్



మాత్రం కొండపి వెళ్లకుండా యర్రగొండపాలెం లోనే పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఖచ్చితంగా అధిష్టానం సురేష్‌ను కొండపి వెళ్లాల్సిందేనని ఆదేశిస్తే తాను చెప్పిన వ్యక్తికే యర్రగొండపాలెంలో టిక్కెట్ ఇవ్వాలని అధిష్టానం దగ్గర హామీ తీసుకునే అవకాశం ఉన్నట్లు వినికిడి. డాక్టర్ సురేష్ కుమార్‌తో పాటు కొమ్మూరి కనకారావు మాదిగ, నందిగం సురేష్, తాడిపత్రి చంద్రశేఖర్ పేర్లు వినిపిస్తున్నాయి.

14న సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో నియోజక వర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్టాసర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సన్నెపోగు సుందర్‌రాజు, జడ్‌పిటిసి చేదూరి విజయ భాస్కర్ తెలిపారు. యర్రగొండపాలెం-1 సచివాలయం వద్ద సెమీక్రిస్మస్ వేడుకలకు సంబం ధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెమీక్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎపి ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య ప్రసాద్, మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కట్టెల హెని క్రిస్టినా, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ జాన్ డేవిడ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా నాయకుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జడ్‌పి కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎఎంసి వైస్ చైర్మన్ కొర్రపోలు జయరావు, కొదముల జిన్నా, ఆలేటి నాగయ్య, వెంకటేశ్వరరెడ్డి, గురిజేపల్లి వలి, జబివుల్లా, నర్రెడ్డి వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

ఖాజీని తొలగించాలని తహశీల్దారు వినతి

ప్రజాశక్తి గిద్దలూరు రూరల్

గిద్దలూరులో ప్రభుత్వ ఖాజీగా పని చేస్తున్న షేక్ నాయబ్ రసూల్‌ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ ముస్లిం పెద్దలు తహశీల్దారు సీతారామయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తొలుత పెద్ద మసీదు వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఖాజీ నాయబ్ రసూల్ నిఖా పుస్తకాలకు రూ.4 వేల నుంచి రూ.7 వేల వసూలు చేస్తున్నట్లు తెలిపారు. బీసీ ఈ కుల ధ్రువీకరణ పత్రం కోసం ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.200 నుంచి రూ.500



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం పెద్దలు

వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మ్యారేజ్ సర్టిఫికెట్లు, బాల్య వివాహాలు జరిపేందుకు రూ.30 నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నట్లు వారు తెలిపారు.

సిఐ, ఎస్ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్

ప్రజాశక్తి- ఒంగోలుకలెక్టరేట్

విచారణ పేరుతో యర్రగొండపాలెంలో నాగెపోగు మోజేష్ పట్ల విచక్షణా రహితంగా వ్యవహరించిన సిఐ, ఎస్ఐపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ కోరారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రఘురామ్ మాట్లాడారు. రాజకీయ ఒత్తిడికి తలొగ్గి తరచూ అమాయకులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సంబంధం లేని కేసులో పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి తనను పోలీసులు తీవ్రంగా కొట్టారంటూ మనస్తాపానికి గురైన మోజేష్ పెట్రోలు పోసుకుని నిప్పం టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనకు కారకులైన ఎస్ఐ, సిఐలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వారిపై ఎస్‌సి,



మాట్లాడుతున్న రఘురామ్

ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. విచారణ పేరుతో స్టేషన్లకు పిలిపించి కులం పేరుతో, అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతున్నారని, అడిగితే విచక్షణారహితంగా హింసిస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజేస్, అత్తంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పంటల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మిచౌంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న అరటి, మిరప పంటలను ఉద్యానశాఖ అధికారి ఆదిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మండలపరిధిలోని బొమ్మలాపురం, నల్లగుంట్ల దెబ్బతిన్న అరటి, మిరప పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. మిరప పంటకు 19:19:19 లేదా 13-0-45 లేదా యూరియా లాంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మ పోషకాలు మిశ్రమం ఐదు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు. మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటిలో లేదా రిడోమిల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదల్లో పిచికారీ చేయాలన్నారు. బూజు తెగులు నివారణకు డైమితోమార్ఫ్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. **పెద్దారవీడు :** తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను మార్కాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు రమాదేవి, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, స్థానిక ఎఒ కె.బుజ్జిబాయి శుక్రవారం పరిశీలించారు. పొగాకు, కంది, మినుము, శనగ పంటలను పరిశీలించి రైతులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషా, జాహ్నవి, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎలుగుబంటి దాడిలో గాయపడిన చెవుల వెంకటేశంకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. ఇష్టకామేశ్వరి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రొటెక్షన్ వాచర్ వెంకటేశంపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం అటవీశాఖ అధికారులు హైదరాబాద్ తరలించారు. అపోలో వైద్యాశాలలో శస్త్ర శుక్రవారం చికిత్స చేశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సురేష్ హాస్పిటల్‌లో ఉన్న బీట్ ఆఫీసర్ మదన్‌తో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. వెంకటేశంకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఏదైనా సహాయం అందించాలన్నా ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అన్ని విధాలా సహాయ పడతామని మంత్రి తెలిపారు.

రైతు కంట కన్నీరు

- నిండా ముంచిన మిచౌంగ్ తుపాను
- పొలాల్లో పడిపోయిన కరెంట్ స్తంభాలు
- నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

తుపాను రైతుకు కన్నీరు తెప్పిస్తోంది. వడ్డీలకు అప్పుతెచ్చి సాగు చేసిన పంట పూర్తిగా నీటి మయం కావడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, తోటవారిపాలెం, సీఇసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతం, గవిని వారిపాలెం, దండుబాట రోడ్డులోని చిట్టివాద ప్రాంతలలో రైతులు వేసిన పంటలు అన్నీ వర్షం దాటికి మునిగిపోయాయి. పిట్టువారిపాలెం బైపాస్ రోడ్డు సమీపంలో రైతులు వందల ఎకరాలలో మినుము సాగు చేశారు. తుఫాను దాటికి పంట మునిగిపోవడంతో పాటు పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలన్ని వరుసగా నేలకు ఒరిగాయి. బుర్లవారిపాలెంలో సాగు చేసిన మొక్కజొన్న ఈదురు గాలికి నేలవాలింది. వేరుశనగ పంట మొత్తం వర్షపు నీరు చేరడంతో ఉరకలెత్తి కుళ్ళిపోయి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. వరి పైరు మునిగి పోయింది. అధికారులు తమ వద్దకు రావడం లేదని, నామమాత్రపు సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు తమను గుర్తించి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.



బుర్లవారిపాలెం వద్ద నీట మునిగిన మినుము, పడ్డ స్థంబాలు

రైతులను ఆదుకోవాలి : సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు

తుఫాను ప్రభావం వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు కోరారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణం ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. షరతులు లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని, నష్టపోయిన రైతులకు సిపిఎం అన్నివేళలా అండగా ఉంటుందని, రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు.

టీచర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజా శక్తి - బాపట్ల రూరల్

డిసెంబర్ 8వ తేదీకి కూడా నవంబరు నెల జీతాలు అందక వేల మంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫ్యాఫ్టో జిల్లా చైర్మన్ బడుగు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సీహెచ్‌టివి సురేష్ అన్నారు. కొందరు పెన్షనర్లకూ పింఛను రావాల్సి ఉందని తెలిపారు. కొత్త నెల ప్రారంభమై వారం రోజులు దాటిపోయినా జీతాలు దక్కని పరిస్థితి కొనసాగుతోందని చెప్పారు. ఒకటో తేదీ జీతం తీసుకోవడం కలగా మారిందని పేర్కొన్నారు. రెండేళ్లుగా ఉపాధ్యాయుల జీతాలు ప్రతి నెలా 7నుండి 15తేదీల్లో చెల్లించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆరోపించారు. 1న ఉద్యోగులు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించక పోవడం ప్రభుత్వం అసమర్థత కిందికి వస్తుందని తెలిపారు. కుటుంబ అవసరాలు, పిల్లల ఫీజులు, అద్దె తదితర అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లలితకుమారి

ఉపాధి హామీ ద్వారా కాలువ పనులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాను కారణంగా పంట పొలాల్లో నీరు నిలబడి, పంటల దెబ్బతింటున్న దృష్ట్యా మురుగు పారుదల సౌకర్యం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో కాలువ పనులు చేపట్టి, నీటిని బయటకు మళ్ళించాలని ఎంపీపీ డివి లంజకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ జి మీరయ్య, వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ కుందేటి రమేష్, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, పశు వైద్యాధికారిణి పి రంజిత, నాయకులు బాలాజీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పేటేరులో మిశ్రమ దాణా పంపిణీ

ప్రజాశక్తి - రేపల్లె

తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న తీరప్రాంత గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు వై కేదారేశ్వర్ సంపూర్ణ మిశ్రమ దానాను పేటేరు గ్రామంలో లబ్ధిదారులకు శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ నిధి నుండి 15టన్నుల మిశ్రమ దానాలు కేటాయించినట్లు తెలిపారు. పాడి రైతులతో మాట్లాడి తుఫాన్ తరువాత పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ జి నరేంద్రబాబు, పేటేరు వైసిపీ ఇంఛార్జి కనపర్తి రవి కిరణ్, వైస్ ఎంపీపీ రావు నెహ్రూలక్ష్మీప్రభాకర్, బొబ్బర్లంక పశు వైద్యాధికారి డాక్టర్ పి మీనాక్షిదేవి, డాక్టర్ ఎ ప్రవీణ్‌కుమార్, మోర్ల హరిత, గోపాలమిత్ర మోర్ల బాబురావు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన ఎస్ఐ సురేష్

ప్రజాశక్తి - వేటపాలెం

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వరద ముంపు పొలాలను పరిశీలినకు బాపట్ల మండలం బుద్దాం గ్రామానికి వెలుతుండగా బుద్దాం గ్రామం వద్ద పోలీసు అదికారులు హైవేపై ట్రాఫిక్ దారి మళ్ళించారు. అదే సమయంలో నిజాంపట్నంకు చెందిన కోక్కిలిగడ్డ ఏసుబాబు నిండు గర్భిణీ అయిన తన భార్య అంజలికి పురిటి నొప్పులు రావడంతో ఆటోలో కర్లపాలెం ఆసుపత్రికి తీసుకు వెళుతూ ట్రాఫిక్ వద్దకు చేరుకున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న వేటపాలెం ఎస్ఐ జి సురేష్ పురిటి నొప్పులతో బాధపడుతున్న ఆమెను గమనించి వెంటనే ఎస్పీ వకుల్ జిందాల్‌కు సమాచారం ఇచ్చి ఆమెను తన ప్రభుత్వ వాహనంలో పోలీసు సిబ్బంది సహకారంతో హాస్పటల్‌కు చేర్చారు. సకాలంలో స్పందించి హాస్పటల్‌కు తరలించి మానవత్వం చాటుకున్న ఎస్ఐని ఆమె బంధువులతోపాటు ఎస్పి వకుల్‌జిందాల్ అభినందించారు. ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. తమ కుటుంబంలో ఆనందాన్ని నింపిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ స్థలం ఆక్రమణను కట్టడి చేయండి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రయాణికులకు నీడ ఇస్తున్న ఏళ్ల నాటి మహా వృక్షాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో హడావుడిగా జెసిబితో తొలగించి స్థలాన్ని చదును చేశారు. చెట్టు తొలగించడాన్ని పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు ప్రశ్నించారు. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే రోడ్డులో ఏ నిర్మాణం కోసం చెట్టు తొలగించారని ప్రశ్నించారు. ఆర్టీసీ డిఎం రామ్మోహనరావుకు ఫోన్ చేయగా తనకు తెలిదని డిఎం చెప్పినట్లు తెలిపారు. ప్రజాసంఘాలు, స్థానిక ప్రజల ఆందోళన అనంతరం ఆర్టీసీ డిఎం బి రామమోహనరావు, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. చెట్టు తొలగించిన ప్రాంతంలో కొలతలు తీయడాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ కొలతలకు, నిర్మాణ అనుమతులకు మున్సిపాలిటీకి సంబంధం లేదని, యుడిఎ పరిధిలో ఉన్నందున ఒంగోలు వారిని సంప్రదించాలని సమాధానం చెప్పారు. అక్కడి స్థలంలో నిర్మించే స్థలానికిఇ 20అడుగులు ఆర్టీసీ స్థలం ఇవ్వాలని కమిషనర్ కోరడంతో తనపరిధిలో 10అడుగులు మాత్రమే ఇచ్చే అధికారం ఉందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ అనుమతి లేకుండా ఎలా నిర్మాణాలు చేస్తారో ప్రజలు గమనించాలని సీనియర్ అడ్వకేట్ వజ్రాల అంజిరెడ్డి అన్నారు. రిలయన్స్ మార్ట్ సిబ్బంది రఫ్ ప్లాన్ తీసుకొచ్చి దాని ప్రకారం కొలతలు పెట్టుకొని రూప్స్ వేశారు. రోడ్డు వైడెన్ ఫైనల్ కొలతలు తేలకుండా కొలతలు వేయడానికి వీల్లేదని ప్రజా సంఘాల ప్రతినిధులు తేల్చి చెప్పారు. ప్రజాసంఘాల అభ్యంతరం తర్వాత రూప్స్ తొలగించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిత్యం ట్రాఫిక్ జామవుతున్న రోడ్డులో భవిష్యత్తులో ఎవరికి ఇబ్బంది లేకుండా ఉండే విధంగా అధికారులు పనిచేయాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వెనక్కి జరపాలని కోరారు. కార్యక్రమంలో కావూరి రఘుచంద్, సిపిఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, సోమేపల్లి రాము, మలాది అంజి రత్తయ్య, పెంట్యాల సుబ్బయ్య, గోరంట్ల శ్రీను, అమర్నేని శీను పాల్గొన్నారు



ఆర్టీసీ స్థలంలో నిర్మాణ ప్రణాళిక పరిశీలన

షరతులు లేకుండా రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను నిండా ముంచిందని, షరతులు లేకుండా రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని నల్లూరుపాలెం, పోతుమేరక, కైతేపల్లి అడ్డరోడ్డు, వడ్డివారిపాలెం గ్రామాలలో తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను శుక్రవారం ఆయన పరామర్శించారు. నీటిలో నానుతున్న వరిపైరు చూసి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతుల రెక్కల కష్టాన్ని తుఫాన్ తుడిచిపెట్టిందని అన్నారు. కష్టనష్టాలను మిగిల్చిందని ఆవేదన చెందారు. అప్పులు చేసి ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు పొలాల్లోనే పనికిరాకుండా పోవటానికి లోపభూయిష్ట మైన పాలనని విమర్శించారు. రైతులపై మరింత అదనపు వ్యయ భారం పడిందని అన్నారు. సకాలంలో డ్రెయినేజి పనులు పూర్తి చేసుంటే చాలా వరకు రైతులకు ఇబ్బంది ఉండేది కాదన్నారు. ఎక్కడికక్కడ డ్రెయిన్లు పూడిక నిండి ఉండటంతో నీరు కదిలే పరిస్థితులు లేక పంటలకు మరింత నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్‌కు దెబ్బతిన్న పంటను కాపాడు కోవడం రైతుకు తలకు మించిన భారంగా మారిందన్నారు. డ్రైనేజీలు, కాలువల్లో తూటుకాడ అడ్డుపడి వేల ఎకరాల్లో పంటనష్టానికి కారణమైందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.



తడిసిన వరిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అనగాని

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -రేపల్లె

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేందుకు సమన్వయంతో పని చేయాలని మండలంలోని పేటేరు వైసిపి ఇంచార్జ్ కనపర్తి రవికిరణ్ సూచించారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించేందుకు పంచాయతీలు, నగర పంచాయతీలు, పట్టణాల్లో యాత్ర నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. మహిళలకు సంక్షేమ పథకాల గురించి విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఒ శివపార్వతి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్, వైస్ ఎంపీపీ రావు నెహ్రూలక్ష్మీ ప్రభాకర్, సెక్రెటరీ దాసరి పుష్పకుమారి, సెక్రెటరీ యార్లగడ్డ రామయ్య పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నేతలు



అసంపూర్తి చెక్‌డాం పరిశీలిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఆలేరు చెక్ డ్యాం పరిశీలన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

జరుబులవారిపాలెం – కేశవరప్పాడు గ్రామాల మధ్య అసంపూర్తిగా ఆలేరు వాగు వద్ద ఉన్న చెక్ డాంను రోటరీ క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు బృందం శుక్రవారం పరిశీలించారు. రోటరీ జిల్లా 3150గవర్నరు డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి ఇటీవల ఇంకొల్లు పర్యటనకు వచ్చిన సందర్భంలో ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నంభొట్ల మోహనకృష్ణశాస్త్రి చెక్ డాం పరిస్థితిపై వివరించారు. చెక్‌డాం పూర్తయితే సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తుందని వివరించారు. స్పందించిన గవర్నర్ తక్షణమే ప్రాజెక్టుకు తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చెక్ డాం పరిశీలించి పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని కోరారు. అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాడారు. ఇది రైతులకు ఉపయోగపడే మంచి ప్రాజెక్టని, ఎంత కష్టమైనా ఈ చెక్ డాం నిర్మాణం పూర్తి చేద్దామని రైతులకు హామీ ఇచ్చారు. ఇందుకు రైతలుకూడా సహకరించాలని కోరారు. హనుమోజిపాలెం, జరుబులవారి పాలెం, కేశవరప్పాడు, రంగప్ప నాయుడుపాలెం గ్రామాలకు సాగు, తాగునీటికి ఉపయోగించుకోవచ్చని రైతులు బృందానికి వివరించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు షేక్ మొహిద్దిన్ బాష, పోపూరి మోహన్‌రావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), మాజీ జడ్పిటిసి వీరగంధం ఆంజనేయులు, మద్దినేని హనుమంతరావు, డాక్టర్ ఆలా కృష్ణమూర్తి, డాక్టర్ ధర్మానందరావు, వి రాఘవరాజు పాల్గొన్నారు.ం

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివర్రు గ్రామంలోని జిలుగువారి పాలెంలో మురుగునీరు నిల్వ ఉన్నచోట దోమల వృద్ధి చెందకుండా ఎంపీపీ ఆదేశాల మేరకు ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ మందు పిచికారి చేశారు. తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నేటికీ నిల్వ ఉందని, దానివల్ల దోమల వృద్ధి చెందే అవకాశం ఉన్నందున దోమల నిర్మూలన మందులను పిచికారి చేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్‌హెచ్‌సిఒ ఆశాజ్యోతి, ఎఎన్ఎం నేలరాణి, ఆశ కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, కిరణ్మయి, విక్టోరియా రాణి, నాగమణి, సురేఖ పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

మరో గేటు కొట్టుకుపోయింది..

- తాజాగా 'గుండ్లకమ్మ' రెండో గేటూ కొట్టుకుపోయిన వైనం
- సముద్రం పాలవుతున్న నీరు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గుండ్లకమ్మ ప్రాజెక్టు మరో గేటు కొట్టుకుపోయింది. గత ఏడాది మూడో నెంబరు గేటు కొట్టుకుపోయి నీరంతా వృథాగా పోయింది. దానికి తాత్కాలికంగా గేట్లు ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పుడు తుపాను కారణంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టు మళ్లీ నిండింది. ప్రస్తుతం 3 టిఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి నీటిప్రవాహం కూడా పెరిగింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి మట్టం చేరేసరికి ఇప్పటికే దెబ్బతిన్న గేట్లపై ఒత్తిడి పెరిగింది. అప్పటికే ఉదయం రెండు గేట్లు ఎత్తి కొంత నీటిని దిగువకు వదిలారు. సాయంత్రానికి మళ్లీ నీరు పెరిగింది. దీంతో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో రెండో నెంబరు గేటు కొట్టుకుపోయింది. నీరంతా వృథాగా సముద్రం పాలైంది. నీటిని ఆపే పరిస్థితి కూడా లేదు. అధికారులు హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. నీటిని నిలిపే ప్రయత్నాలు చేయలేని పరిస్థితి. అంతా వృథాగా పోయింది. ఇపుడు పొగాకు రైతులకు ఈ నీరు కీలకం. మరో వైపు సాగర్ జలాశయం నుంచి నీళ్లు రానందున వర్షాలకు గుండ్లకమ్మ నిండటంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ఇప్పుడు గేటు కొట్టుకుపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏడాది నుంచి గేట్లకు మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. తాత్కాలికంగా గేటుకు షట్టర్ పెట్టారు. దీంతో పాటు మరి కొన్ని గేట్లు కూడా దెబ్బతిన్నాయి. దాదాపుగా అన్ని గేట్లు తుప్పుపట్టాయి. వాటిపై దృష్టిలేదు. నిర్వహణ సక్రమంగా లేదు. దీంతో ఏడాది నుంచి గేట్లు తెగిపోవడం మొదలైంది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. అప్పట్లో ఇరిగేషన్ మంత్రి రాంబాబు వచ్చి పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపడతామని ప్రకటించారు. ఇప్పటికీ దిక్కులేదు. ఇటీవల గుండ్లకమ్మ గేటు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు పాదయాత్ర కూడా చేపట్టారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. జిల్లా మంత్రికీ పట్టలేదు. అధికారులు కూడా అదే దారిలో ఉన్నారు. కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లింపులు చేయనందున గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

గుండ్లకమ్మ ప్రాజెక్టు రెండో గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉంటున్న నదీ పరివాహక గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలి వర్షాలతో ప్రాజెక్టులో 2 టీఎంసీలకు పైగా నీరుందన్నారు. ప్రాజెక్టు రెండో నెంబర్ గేటు కింది భాగంలో ఉన్న 2 ఎలిమెంట్స్ కొట్టుకుపోయాయని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన ఇంజనీరింగ్ అధికారులు స్టాప్ లాక్స్ పెడుతున్నారని చెప్పారు. ప్రాజెక్టులో మరో 1.5 టీ.ఎం.సీ.ల నీరు ఉంటుందన్నారు. నీటి లభ్యతపై రైతులు ఆందోళన చెందవద్దన్నారు. గేట్ల మరమ్మతుల కోసం టెండర్లు పిలిచామని చెప్పారు.

రైతులకు తీవ్ర నష్టం

రైతుసంఘం నేత జయంతిబాబు

గుండ్లకమ్మ గేట్లు మరమ్మతులు చేయాలని ఏడాది నుంచి కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టలేదని రైతుసంఘం నేత జయంతిబాబు విమర్శించారు. రిజర్వాయర్ నిండినందున రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. పొగాకు, ఇతర ఆరుతడి పంటలకు బాగా ఉపయోగపడేదన్నారు. ఇపుడు గేటు కొట్టుకుపోవడం వల్ల నీరంతా వృథాగా పోయిందన్నారు. ఇది చాలా దుర్మార్గమన్నారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తీరు చాలా ఆందోళనగా ఉందన్నారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



వరద నీటిలో ఉన్న మిర్చి పొలాలు

కారంచేడును
వీడని వరద ముంపు

12,500 ఎకరాలకు పైగా దెబ్బతిన్న పంట

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలో కారంచేడు, కుంకల మర్రు, స్వర్ణ, రంగప్పనాయుడుపాలెం, ఆదిపూడి, కేశవరపాడు, స్వర్ణ పాలెం. ఇంకా పలు ప్రాంతాల్లో వరద ముంపు ఇంకా వీడలేదు. పంట పొలాల్లో వరద నీరు అలాగే ఉంది. రైతులు వరద నీటిని బయటకు పంపించడానికి వ్యయ ప్రయాసలు పడుతున్నారు. కొద్దిపాటి అవకాశం ఉన్నా కూడా వేసిన పంటను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు. లక్షల రూపాయలు అప్పు చేసి పంటలు వేసిన రైతులు పంట నీట మునగడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. మండలం మొత్తం మీద సుమారు 50 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. వరద ముంపునకు సుమారు 12,500 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. కారంచేడు మండలంలో తాజాగా వరద ముంపునకు 6750 ఎకరాల్లో వరి, రెండు వేల ఎకరాలకు పైగా పొగాకు, 2,500 ఎకరాలకు పైగా మిర్చి, 1750 ఎకరాల్లో సెనగ.. ఇవి కాక పత్తి, మినుము పంటలు వరద ముంపునకు గురైనట్లు సమాచారం. పూర్తిగా వరద ముంపు ఇంకా తగ్గకపోవడంతో అధికారులు సరైన అంచనాలకు రాలేదు.



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న దామచర్ల జనార్థన్

రైతాంగాన్ని ఆదుకోవాలి

కలెక్టర్‌ను కోరిన దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మిచౌంగ్ తుపాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, మత్స్యకారుల బోట్లకు పరిహారం, సబ్సిడీలో వలలను అందించాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కోరారు. ఈ విషయమై స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం కలిసిన దామచర్ల జనార్దన్‌రావు, టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన మత్స్యకార గ్రామాలు కొత్తపట్నం మండలంలోని కొత్తపట్నం, కె.పల్లెపాలెం, ఈతముక్కల, రాజుపాలెం, మడనూరును, ఒంగోలు రూరల్ మండల పరిధిలోని వలేటివారిపాలెం, కరవది, ఉలిచి, చేజర్ల, బొద్దులూరి వారి పాలెం, త్రోవగుంట గ్రామాలలో ఈ నెల 6, 7 తేదీలలో పర్యటించానన్నారు. రైతులు పొగాకు, శనగ, వరి, మిర్చి, జనుము పంటలను సాగు చేస్తున్నారని, తుపాన్ కారణంగా పంట నష్టం జరిగి, రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని పేర్కొన్నారు. ంట నష్టపోయిన రైతుల పొలాలను సంబంధిత అధికారులతో పరిశీలన చేయించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, మత్స్యకారులకు కూడా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, కొరాని నాగేశ్వరరావు, బండారు మదన్, నందూరి చంద్ర, పాలపర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఒంగోలు మండల పరిధిలోని వెంగముక్కపాలెం గ్రామంలో దెబ్బతిన్న పొగాకు, మిరప పంటలను ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాతలతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి వై.గోపిచంద్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహశీల్దార్ పి.మురళి, వ్యవసాయ, ఉద్యాన వన శాఖల మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే స్పందన

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజానీకం పలు రకాల సమస్యలపై అర్జీలను కలెక్టర్‌కి అందజేశారు. అనేక భూ సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు, ఇండ్ల స్థలాలు, ఎక్కువగా రెవెన్యూ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూములను ఆన్లైన్ చేయాలని స్థానిక ఎస్సీ మాదిగలు కోరారు. సుమారుగా 25 ఏళ్ల నుండి పంటలు వేసుకుంటున్నామని, ఇంతవరకు ఆన్లైన్ ఎక్కకపోవడంతో రైతు భరోసా రావడం లేదని తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ స్పందించి 15 రోజుల్లో ఆన్లైన్ చేస్తామని హామీ ఇచ్చారు. రీ సర్వే అనేక రకాల తప్పు తడకలతో ఉందని, దాని ద్వారా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసులరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఎంపీడీవో పి సుజాత, తహశీల్దార్ బివి రమణారావు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, బాలినేని

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం

అతి తక్కువ సమయంలో పటిష్ట భద్రత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా నిబద్ధతతో బందోబస్తు విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు. అతితక్కువ సమయంలో పటిష్ట భద్రతతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనను బాపట్ల జిల్లా వకుల్ జిందాల్ విజయవంతంగా నిర్వహించారు. ఎస్పీ స్వయంగా హెలిప్యాడ్ ప్రాంతాన్ని, కాన్వాయ్ వెళ్ళు మార్గాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేస్తూ , ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా సుమారు 1150 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించి ప్రశాంతమైన వాతావరణంలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతంగా జరిగేవిధంగా చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నిమిత్తం భద్రత ఏర్పాట్లను పరిశీలించడానికి బాపట్లకు వచ్చిన గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు భద్రత ఏర్పాట్లను పరిశీలించి కేవలం ఒక్కరోజులోనే కట్టుదిట్టమైన భద్రత చర్యలను తీసుకున్న జిల్లా ఎస్పీని అభినందించారు. పటిష్టమైన ప్రణాళికను ఏర్పాటు చేసుకొని దానిని అమలుపరుస్తూ విధులు నిర్వర్తించడం వల్ల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతంగా పూర్తి చేయగలిగామని, హెలిప్యాడ్ వద్ద, కాన్వాయ్ వెళ్ళు మార్గంలో, ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖీ మాట్లాడే వేదిక వద్ద, నీటమునిగిన పంటలను పరిశీలించు ప్రదేశంలో, ట్రాఫిక్ పాయింట్ లలో, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో బందోబస్తు విధులు సమర్థవంతంగా నిర్వహించడం వల్ల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఎటువంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించగలిగామని ఎస్పీ తెలిపారు.



సిఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్, జెడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బలరాం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సిఎం జగన్

సీఎంను కలిసిన బలరాం, బూచేపల్లి

తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు బాపట్లకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి శుక్రవారం కలిశారు. హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.